సాక్షి ఖమ్మం

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



క్వార్టర్లు ఖాళీ చేయండి

ఖమ్మంలోని కేఎంసీ క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. 8లో



అదే ఆవేదన.. అవే బారులు

యూరియా సరిపడా రాకపోవడంతో ఒక్కో బస్తా మాత్రమే ఇస్తుండగా రైతులు రోజంతా బారులు దీరాల్సి వస్తోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 24°

జిల్లాలో పలుచోట్ల మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ ఆరోగ్యమిషన్ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిపై నాలుగు మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి తెలిపారు. మల్టీ జోన్-1లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాక దరఖాస్తుపత్రం, సర్టిఫికెట్ల జిరాక్స్‌లను తమ కార్యాలయంలో ఈనెల 26నుంచి 30వ తేదీ సాయంత్రం 5గంటల లోపు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలు https: khammam. telangana. gov. in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు



పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ నరేందర్

ఖమ్మంవైద్యవిభాగం: ఒకరు నేత్రదానం చేయడం ద్వారా ఇంకో ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్ తెలిపారు. సెప్టెంబర్ 8 వరకు కొనసాగే నేత్రదాన పక్షోత్సవాలు ఖమ్మం ఐ బ్యాంక్ ఆధ్వర్యాన సోమవారం పెద్దాస్పత్రిలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ నేత్రదానంతో రెండు జన్మలు సొంతమవుతాయని తెలిపారు. కంటి వైద్య నిపుణులు రామూనాయక్ మాట్లాడుతూ వ్యక్తి మృతి చెందిన 6 – 8 గంటల్లో నేత్రదానానికి అవకాశముంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులతో మరింత బాధ్యత

ఖమ్మంక్రైం: పదోన్నతులు బాధ్యతను మరింతగా పెంచుతాయని పోలీసు కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కమిషనర్ పరిధి వివిధ పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న 39మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు సోమవారం వారికి సీపీ బ్యాడ్జీలు అలంకరించి అభినందించాక మాట్లాడారు. ఇక్కడితో ఆగిపోకుండా మరింత ఉన్నత స్థాయికి చేరేలా కృషి చేయాలని సూచించారు. కాగా, పదోన్నతి పొందిన 39మందిలో 22మందిని మహబూబాబాద్, 13మంది భద్రాద్రి కొత్తగూడెం, ఒకరిని ఖమ్మం జిల్లాకు కేటాయించడమే కాక ఇంకో ముగ్గురిని వివిధ విభాగాలకు బదిలీ చేశారు.

జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిగా ముజాహిద్



మహమ్మద్ ముజాహిద్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా మహమ్మద్ ముజాహిద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించాక కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్నాళ్లు వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉన్న పురంధర్ ఇకపై పశుసంవర్ధక శాఖ డీడీగా కొనసాగనున్నారు.


బాలికలు చదువులో రాణించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ తులసి

ఎర్రుపాలెం: బాలికలు జీవితంలో ఉన్నత స్థాయికి చేరేలా చదువుపై దృష్టి సారించాలని జీసీడీఓ తులసి సూచించారు. ఎర్రుపాలెంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం తనిఖీ చేసిన ఆమె విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆతర్వాత మధ్యాహ్న భోజనం, సామగ్రి నాణ్యతను పరిశీలించి సూచనలు చేశారు. కాగా, ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్లతో భర్తీ చేయడమే కాక ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పాఠశాల సూపరిండెంట్ కె.సరిత, ఉపాధ్యాయులకు ఆమె సూచించారు.

ఒక క్లిక్ చేస్తే చాలు..!



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయాన్ని పెంచడంతోపాటు ప్రజలకు సులభంగా సేవలు అందించేలా అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఇందులో భాగంగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య చొరవతో గూగుల్ ఎర్త్ మ్యాప్ అనుసంధానంగా రియల్‌టైమ్ రెవెన్యూ దాష్ బోర్డు తయారీకి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ తర్వాత ఈ విధానం ఖమ్మంలోనే అందుబాటులోకి రానుంది. ఖమ్మం 44వ డివిజన్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకోగా, సమస్త సమాచారాన్ని దాష్ బోర్డులో నిక్షిప్తం చేసి పన్నుల స్వీకరణ ప్రక్రియ మొదలుపెడతారు. ఇక్కడ విజయవంతం అయ్యాక అన్ని డివిజన్లకు విస్తరిస్తారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

అన్ని వివరాలతో...

ఇంటి పన్నుల చెల్లింపులు, బకాయిల వివరాలను తెలుసుకునేందుకు ప్రస్తుతం సీడీఎంఏ వెబ్‌సైట్ దాష్ బోర్డు ఉన్నా ఇటు పౌరులు, అటు అధికారులు పూర్తి సమాచారం పొందలేక పోతున్నారు. బకాయిలు, అసెస్‌మెంట్ కచ్చితమైన స్థానం, వారి పరిధిలోని బిల్ కలెక్టర్ వివరాలు కూడా సమగ్రంగా లేవు. దీంతో ప్రత్యేక రియల్ టైమ్ రెవెన్యూ డాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని కమిషనర్ అభిషేక్ నిర్ణయించారు. ఈమేరకు కేఎంసీకి www.khammammc.com వెబ్‌సైట్ రూపొందించడంతోపాటు డాష్ బోర్డు ఏర్పాటు చేశారు.

పన్నుల వివరాలతో రెవెన్యూ డాష్ బోర్డు

- వెబ్‌సైట్‌తో కేఎంసీకి ఆదాయం.. సులభంగా పౌరసేవలు
- ఆఫీస్‌కు వెళ్లే పనిలేకుండా అరచేతిలో సమాచారం
- పైలట్ ప్రాజెక్టుగా 44వ డివిజన్‌లో అమలు

అరచేతిలో సమాచారం

కేఎంసీ పరిధి 60 డివిజన్లలో 82,076 అసెస్‌మెంట్లు(భవనాలు)ఉన్నాయి. ఇందులో వాణిజ్య, గృహావసరాలు కలిసినవి 3,730, వాణిజ్య పరమైనవి 3,795, గృహావసరాలవి 74,551 ఉన్నాయి. వీటన్నింటి ద్వారా ఏటా పన్నుల రూపంలో రూ.31.64 కోట్లు ఆదాయం వస్తోంది. ఈనేపథ్యాన ప్రతీ అసెస్‌మెంట్ పూర్తి సమాచారంతో గూగుల్ ఎర్త్ మ్యాప్ అనుసంధానంగా డాష్ బోర్డు రూపొందించారు. డాష్‌బోర్డు మ్యాప్‌లో కనిపించే ప్రతీ ఇంటికి ఒక పాయింట్ పెట్టారు. దీనిపై క్లిక్ చేస్తే ఇంటి పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. అసెస్‌మెంట్ నంబర్, ఇంటి నంబర్, ఎన్ని అంతస్తులు, ఎంత పన్ను చెల్లించాలి, పాత బకాయి ఎంతనే వివరాలు తెలుసుకోవచ్చు.

పైలట్‌గా 44వ డివిజన్

కొత్త వెబ్‌సైట్‌కు సంబంధించి ప్రయోగాత్మకంగా 44వ డివిజన్‌ను ఎంపిక చేశారు. ఈ డివిజన్‌లోని 907 అసెస్‌మెంట్ల వివరాలు పొందుపరిచారు. తద్వారా రూ.59,66,811 పన్ను పెండింగ్ ఉండగా, రూ.38,74,610 చెల్లించినట్లు డాష్‌బోర్డులో చూపిస్తోంది. అంతేకాక ప్రతీ ఇంటికి పాయింట్ కేటాయించి పన్నుల వివరాలు నమోదు చేశారు. ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఈ డాష్‌బోర్డు మ్యాప్‌లో ఇంటిపై మార్క్‌ను క్లిక్ చేస్తే సమస్త సమాచారం అందుబాటులోకి రానుంది.

ఆదాయాన్ని రెట్టింపు చేసేలా..

గూగుల్ ఎర్త్‌మ్యాప్ డాష్‌బోర్డు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాక 60 డివిజన్లకు సంబంధించి సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. ముందుగా డివిజన్ల పరిధిలో అసెస్‌మెంట్ల సర్వే చేపట్టి పన్నుల లక్ష్యాన్ని తేలుస్తారు. తద్వారా ప్రస్తుతం ఆస్తి పన్ను ద్వారా వస్తున్న ఆదాయం భారీగా పెరిగే అవకాశముందని తెలుస్తోంది. డాష్‌బోర్డు వినియోగించడంతో పన్నుల వసూళ్లు, చెల్లింపుల్లో పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇంటి యజమాని సైతం ఎప్పటికప్పుడు బకాయిల వివరాలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

సేవలు సులభతరం..



అసెస్‌మెంట్ వివరాలు తెలుసుకునేందుకు గూగుల్ ఎర్త్ మ్యాప్ అనుసంధానంతో రియల్‌టైమ్ రెవెన్యూ డాష్‌బోర్డు సిద్ధమవుతోంది. దీంతో ప్రతీ చిన్న పనికి కార్యాలయానికి వచ్చే అవసరముండదు. అంతేకాక యజమాని వివరాలను సులువుగా తెలుస్తాయి. అధికారులకు సైతం పన్నుల బకాయిలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం 44వ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్

గణపతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



కాలుష్య నియంత్రణ మండలి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

- అందరూ స్వీయనియంత్రణ పాటించాలి
- సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంగాంధీచౌక్: గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు, ఉత్సవ కమిటీలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. విగ్రహాల తరలింపు సమయాన విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని, నిమజ్జనం చేసేరోజు అందరూ స్వీయ నియంత్రణ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. అలాగే, నిమజ్జనం పాయింట్ల వద్ద బారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లు, మద్య నిషేధం అమలు, ప్రాథమిక చికిత్స కేంద్రాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల నియామకంపై సూచనలు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ వివాదాస్పద ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటుచేయొద్దని తెలిపారు. అలాగే, నిమజ్జనం రోజున రూట్ మ్యాప్ ఖరారుపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన మట్టి విగ్రహాల ఆవశ్యకతపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. డీఆర్‌ఓ ఏ.పద్మ శ్రీ, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, డీపీఓ ఆశాలత, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు వి.వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్రాం, పవార్, అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, యు.మహేష్‌బాబు, రవీందర్, గణేష్ ఉత్సవ కమిటీల బాధ్యులు విద్యాసాగర్, జైపాల్‌రెడ్డి, ప్రసన్నకృష్ణ, సాయికిరణ్ పాల్గొన్నారు.

గణపతి మండపాలకు ఉచిత విద్యుత్

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఉచిత విద్యుత్ అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పది రోజుల కాల పరిమితితో ఉచిత విద్యుత్ సరఫరా చేస్తూ, గత ఏడాది మాదిరిగానే మండపాలు, విద్యుత్ సామర్థ్యం వివరాలను యాప్‌లో పొందుపర్చాలని తెలిపారు. కాగా, ఒక కిలోవాట్ లోడ్ వరకు రూ.1,560ల నుంచి రెండు కిలోవాట్ల లోడ్ వరకు రూ.3,020గా చార్జీలు నిర్ణయించగా, ఈ నగదును ప్రభుత్వం డిస్కంలకు చెల్లించనుంది.

రూ.2లక్షలతో 'స్వగృహ' రిజిస్ట్రేషన్

రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్‌లో ఫ్లాట్ల కోసం ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఈనెల 30లోగా రూ.2లక్షల చెల్లించి రిజిస్టర్ చేసుకోవచ్చని కలెక్టర్ అనుదీప్ సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్‌లో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 9. 22 ఎకరాల్లో ఎనిమిది టవర్లుగా నిర్మించిన 576 ఫ్లాట్లు అసంపూర్తిగా ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గజం భూమి రూ.1,150 ధరగా నిర్ణయించినట్లు చెప్పారు. ఖమ్మం – దేవరపల్లి హైవేతో కనెక్టివిటీ పెరుగుతుందని, మున్నేటి రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ముంపు సమస్య ఉండదని తెలిపారు. టీజీవోస్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, గుంటుపల్లి శ్రీనివాసరావు, డీఆర్‌ఓ ఏ.పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం



వృద్ధుల వద్దకు వచ్చి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించాక అధికారులకు సూచనలు చేశారు. చేయగలిగిన పని వెంటనే పూర్తి చేయడంతో పాటు సాధ్యం కాకపోతే అందుకు కారణాలతో సమాచారం ఇవ్వాలని తెలిపారు. కాగా, రేషన్ డీలర్ల సంక్షేమ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, జానీమియా కమీషన్ చెల్లింపుపై ప్రజావాణితో పాటు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అలాగే, ప్రజావాణికి పలువురు దివ్యాంగులు, వృద్ధులు రావడంతో గమనించిన కలెక్టర్ అనుదీప్ వారిని పక్కన కూర్చోబెట్టి అక్కడకే వెళ్లి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు.

డీఈఓ బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ జిల్లా విద్యాశాఖాధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డీఈఓగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ వ్యవహరిస్తున్నారు. ఆ బాధ్యతలను ప్రభుత్వం శ్రీజకు అప్పగించింది.

నేడు పదోన్నతి ఉత్తర్వులు

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు(ఎస్‌ఏ)గా పదోన్నతి కల్పించే ప్రక్రియ చివరి దశకు చేరింది. వెబ్ ఆప్షన్లు ఎంచుకునే గడువు సోమవారం ముగియగా, మంగళవారం పదోన్నతి పొందిన వారికి ఉత్తర్వులు అందనున్నాయి. జిల్లాలో 281 ఖాళీలు ఉండగా.. 209మందే అర్హులుగా తేలారని తెలిసింది. కాగా, ఆదివారం ప్రదర్శించిన పదోన్నతుల జాబితాలో సోమవారం నాటికి మార్పులు జరిగాయని.. అక్రమంగాకొందరిని బదిలీ చేయడంతోనే ఇలా జరిగిందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు ఆరోపించారు. జాబితాను సరిచేయాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు, నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి సంత వేలం వాయిదా

కారేపల్లి: గత ఏడాది కంటే తక్కువకు పలకడంతో కారేపల్లి సంత బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి నల్లమోతు శేషయ్య తెలిపారు. కారేపల్లి వారాంతపు సంతను ఏడాది పాటు అప్పగించేందుకు సోమవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన వేలం నిర్వహించారు. అయితే, గత ఏడాది రూ.5.30లక్షలు పలకగా, ఈసారి రూ.2.55లక్షలే రావడంతో వాయిదా వేసినట్లు శేషయ్య తెలిపారు. కాగా, వేలం పాటను సింగరేణి జీపీ తీర్మానం లేకుండా ఎలా నిర్వహిస్తారంటూ ఎంపీటీసీ రవీంద్ర ప్రసాద్, గ్రామ కార్యదర్శి నెహ్రూ ప్రశ్నించారు. ఈక్రమాన ఒకింత వాగ్వాదం జరగగా శేషయ్యకు నోటీసులు అందజేశారు. ఉద్యోగులు మూడ్ మోహన్‌చౌహాన్, కె.సత్యం, గోపాలరావు, జవ్వాజి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మరింత పారదర్శకంగా..

- జూనియర్ కాలేజీల్లో 'ఎఫ్ఆర్ఎస్' హాజరు
- అమల్లోకి వచ్చిన నూతన విధానం



సత్తుపల్లి కాలేజీలో హాజరు నమోదు చేస్తున్న అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్)ను అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో జిల్లాలోని 21 ప్రభుత్వ కాలేజీల్లో ప్రారంభించారు. ఈనేపథ్యాన సోమవారం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,779మంది విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానంలో నమోదు చేశారు. ప్రతి రోజు ఉదయం 9-40నుంచి 10గంటల్లోపు, మధ్యాహ్నం 1-45నుంచి 2గంటల వరకు రెండు పూటలా హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది.

గైర్హాజరైతే తల్లిదండ్రులకు మెసేజ్

పలు జూనియర్ కాలేజీలకు విద్యార్థులు సకాలంలో రాకపోగా, వచ్చినా సాయంత్రం వరకు ఉండడం లేదు. దీంతో నానాటికీ హాజరుశాతం తగ్గుతోందని ప్రభుత్వం గుర్తించింది. ఈమేరకు హాజరు నమోదు పెంచడమే పాటు పక్కాగా నమోదు చేసేలా ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. అంతేకాక ఎవరైనా విద్యార్థి కళాశాలకు రాకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు మెసేజ్ పంపే ఏర్పాట్లు చేశారు. తద్వారా హాజరుశాతం పెరిగి డ్రాపౌట్లు తగ్గుతాయని చెబుతున్నారు. కాగా, ప్రస్తుతం విద్యార్థులకే ఎఫ్ఆర్ఎస్ అమలు చేస్తుండగా... త్వరలో అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లకు అమలయ్యే అవకాశముందని సమాచారం.

మెరుగైన ఫలితాలకు అవకాశం

ఎఫ్ఆర్ఎస్ అమలు చేస్తుండడంతో విద్యార్థుల హాజరు వివరాలు తల్లిదండ్రులకు తెలిసిపోతాయి. తద్వారా రెగ్యులర్‌గా కాలేజీకి వచ్చే అవకాశముంది. ఈమేరకు క్రమం తప్పక పాఠాలు వింటూ అధ్యాపకుల సూచనలు పాటిస్తే మెరుగైన ఫలితాలు నమోదవుతాయి.

– రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

బాబోయ్.. డెంగీ





పెద్దాస్పత్రి ఓపీలో పేర్ల నమోదుకు బారులు దీరిన జనం

- వంద దాటిన కేసులు.. ఈ నెలలోనే 80
- గత పది రోజుల్లో సీజనల్ జ్వరాలు మరింతగా వ్యాప్తి
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు పెరుగుతున్న తాకిడి

ఖమ్మంవైద్యవిభాగం: వాతావరణంలో మార్పులతో జిల్లావాసులు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పారిశుద్ధ్య లోపం ఏర్పడగా గ్రామాలు, పట్టణాల్లో దగ్గు, జలుబు, గొంతునొప్పి తదితర సమస్యలతో జనం ఆస్పత్రులకు బారులు దీరుతున్నారు. దీనికి తోడు డెంగీ కేసులు హడలెత్తిస్తున్నాయి. వర్షాలు తగ్గాక పారిశుద్ధ్య సమస్యతో దోమలు వృద్ధి చెందడం జ్వరాల వ్యాప్తికి కారణంగా తెలుస్తోంది. గత పది రోజులుగా సీజనల్ వ్యాధులు వృద్ధితో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు జిల్లా ఆస్పత్రి సైతం కిటకిటలాడుతోంది. ఇవి కాక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న వారు సైతం ఎక్కువగానే ఉంటున్నారు.

113 డెంగీ కేసులు

జిల్లాలో ఇప్పటివరకు 113డెంగీ కేసులు నమోదయ్యాయి. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కట్టడికి చర్యలు చేపట్టినా కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. అలాగే, జ్వరం, జలుబు, దగ్గు, డయేరియాతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఎక్కువ సంఖ్యలో జ్వర పీడితులే వస్తుండగా.. నిత్యం 2వేలకు పైగా ఓపీ నమోదవుతోంది. అలాగే, ఇన్ పేషంట్ వార్డులు సైతం నిండిపోతున్నాయి. జ్వర పీడితుల కోసం ప్రత్యేక ఫీవర్ వార్డులు ఏర్పాటుచేస్తే, అందులో పదుల సంఖ్యలో డెంగీ బాధితులు వైద్యం పొందుతున్నారు.


ఈ నెలలోనే అత్యధికం

ఈ ఏడాది ఆగస్టులో ఎక్కువగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈనెల 1నుండి 24వ తేదీ వరకు మొత్తం 82 కేసులు వెలుగు చూశాయి. ఎం.వెంకటాయపాలెం పీహెచ్‌సీ పరిధిలో 15, మంచుకొండ 14, సుబ్లేడులో 12, తిరుమలాయపాలెం, తల్లాడలో ఎనిమిది చొప్పున, ముస్తఫానగర్, మామిళ్లగూడెం ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరేసి కేసులు నమోదయ్యాయి. వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 113 డెంగీ కేసులు వెలుగు చూడగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారిని లెక్కిస్తే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. కాగా, సీజనల్ వ్యాధుల జోరుతో ప్రైవేట్ ఆస్పత్రుల బాధ్యులు డెంగీ చికిత్స పేరిట డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జ్వరాల వ్యాప్తికి దోమలే కారణమవుతున్నాయని, అపరిశుభ్రమైన నీరు డయేరియాకు కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు. ఈమేరకు కాచి వడబోసిన నీరు, వేడి ఆహార పదార్థాలు, పోషకాలు, పండ్లు, కూరగాయలు తీసుకోవడమే కాక పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.

ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు

నెల	శాంపిళ్లు	కేసులు
జనవరి	518	00
ఫిబ్రవరి	607	02
మార్చి	408	01
ఏప్రిల్	248	00
మే	281	00
జూన్	614	01
జూలై	1,718	27
ఆగస్టు(24వరకు)	1,287	82

ఒకేరోజు 360 ఓపీ



చికిత్స కోసం క్యూ కట్టిన జ్వరబాధితులు

నేలకొండపల్లి: వైరల్ జ్వరాల వ్యాప్తితో నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. సోమవారం ఒకేరోజు 360 మంది ఓపీలో చికిత్స చేయించుకోగా వీరిలో 60 మందికి పైగా ఇన్‌పేషెంట్లుగా చేరారు. జ్వరాల బారిన పడి చికిత్స కోసం వచ్చిన వారిలో వసతి గృహాల విద్యార్థులు కూడా ఉన్నారు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ మంగళ మాట్లాడుతూ ఎవరూ ఇబ్బంది పడకుండా సేవలు అందిస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రంగనాథ్



రంగనాథ్‌ను సన్మానిస్తున్న యూనియన్ బాధ్యులు

కారేపల్లి: కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం (కేకేఆర్) మండలాల యూనిట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కారేపల్లికి చెందిన ఓరుగంటి రంగనాథ్ ఎన్నికయ్యారు. లింగాలలో సోమవారం ఈ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగేశ్వరరావు, హరిగోపాల్‌రావుతో పాటు బొమ్మిగి నాగభూషణం, జనార్దన్, శంకర్‌రావు, రవి, అనంతారపు వెంకటాచారి, పోలగాని శ్రీనివాసరావు, సూర్యదేవర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి అభినందన



ఎన్‌ఫోర్స్ బృందంతో డైరెక్టర్ ఖాసిం, అధికారులు

ఖమ్మంక్రైం: పాల్వంచ మీదుగా అక్రమంగా తరలిస్తున్న మారణాయుధాలు, ఎండు గంజాయిని ఇటీవల చాకచక్యంగా స్వాధీనం చేసుకున్న ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు. హైదరాబాద్‌లో ఆబ్కారీ భవన్‌లో సోమవారం అభినందించిన ఆయన రూ.50వేల క్యాష్‌రివార్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంలో అసిస్టెంట్ కమిషనర్ ఏ.గణేష్, ఎక్సైజ్ అధికారులు, ఉద్యోగులు ఎస్.రమేష్, సీహెచ్.శ్రీహరిరావు, ఎంఏ.కరీం, జి.బాలు, కె.సుధీర్, టి.వెంకట్, హరీష్, వి.హన్మంతరావు, పి.విజయ్, వీరబాబు, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

ఏదులాపురం చెరువు ఆక్రమణపై సర్వే



చెరువు శిఖం, ఆయకట్టులో సర్వే చేస్తున్న ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురంలోని ఈదుల చెరువును రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సంయుక్త ఆధ్వర్యాన సోమవారం సర్వే చేశారు. గతనెల 21న 'సర్కార్ భూములు హాంఫట్' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు చెరువు మొత్తం విస్తీర్ణం ఎంత, ఇప్పటివరకు ఎంత ఆక్రమణకు గురైందో పరిశీలించారు. ఈక్రమాన దాదాపు 35 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైనట్లు గుర్తించగా, సర్వే పూర్తయ్యాక కలెక్టర్‌కు నివేదిక అందించనున్నారు. ఇక్కడ ఎకరా ధర రూ.2కోట్ల వరకు ఉండడంతో ఆక్రమిత భూమి విలువ రూ.70 కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. కొంతకాలంగా సర్వేయర్లు శిక్షణలో ఉండడంతో ఆలస్యమైనా సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

క్వార్టర్లు ఖాళీ చేయండి..

- కేఎంసీ క్వార్టర్లల్లో నివసిస్తున్న వారికి నోటీసులు
- రిటైర్డ్ ఉద్యోగులు, బయటి వారు ఉండడం.. అదనపు నిర్మాణాలతో చర్యలు
- 50ఏళ్లుగా ఉంటున్న తాము ఎక్కడకు వెళ్లాలంటూ ఆందోళన



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ క్వార్టర్లను ఖాళీ చేయాలని అధికారులు జారీ చేసిన నోటీసులతో అక్కడ నివాసం ఉంటున్న వారిలో ఆందోళన మొదలైంది. జిల్లా కేంద్రంలోని రేవతి సెంటర్‌లో ఉన్న క్వార్టర్లలో 128 ఉంటుండగా, రెండు రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులు, సిబ్బంది, బయట వ్యక్తులు ఉంటే వెంటనే ఖాళీ చేయాలని అందులో పేర్కొనగా.. ఏళ్ల తరబడి క్వార్టర్లలో ఉంటున్న తాము ఉన్న ఫలంగా ఎక్కడకు వెళ్లాలని వారు ఆందోళన చెందుతున్నారు.

60 ఏళ్ల క్రితం నిర్మాణాలు

ఖమ్మం మున్సిపాలిటీగా ఏర్పడిన సమయంలో ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల కోసం నగరంలోని మూడు ప్రాంతాల్లో క్వార్టర్లు నిర్మించారు. గుట్టల బజార్, ఎల్ఐసీ కార్యాలయం ప్రాంతాల్లోని క్వార్టర్లను అక్కడ ఉండే వారికే గతంలో క్రమబద్ధీకరించారు. ఇక రేవతిసెంటర్‌లోని 120 క్వార్టర్లు కార్పొరేషన్ ఆధీనంలోనే ఉన్నా అధికారులు పర్యవేక్షించకపోవడంతో అదనపు నిర్మాణాలు చేపట్టారని తెలుస్తోంది. ఇందులో భాగంగా క్వార్టర్లలో రిటైర్డ్ అయిన వారే కాక బయట వ్యక్తులు ఉంటున్నారనే ఫిర్యాదులు అధికారులకు అందినట్లు తెలిసింది. ఇంతలోనే నివాసముండే వారి వివరాలు ఇవ్వాలని ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయడంతో కమిషనర్ దృష్టికి చేరింది. ఆపై చేపట్టిన సర్వేలో 128 క్వార్టర్లకు గాను, అదనంగా మరో 12కు పైగా నిర్మించి మొత్తం 140 కుటుంబాలు ఉంటున్నాయని తేలడంతో అధికారులు ఆగ్రహంగా ఉన్నారు.

ఏళ్ల తరబడి పట్టింపు లేక..

క్వార్టర్లలో ఉద్యోగ విరమణ చేసిన వారితో వారి బంధువుల కుటుంబాలు, ఇతర వ్యక్తులు నివాసం ఉంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రిటైర్డ్ ఉద్యోగులను ఖాళీ చేయించి మరొకరికి క్వార్టర్ కేటాయించాల్సి ఉన్నా రెవెన్యూ విభాగం అధికారులు అలా చేయలేదు. ఇక క్వార్టర్లలో ఉన్న వారికి హెచ్‌ఆర్‌ఏ(హౌజ్ రెంట్ అలవెన్స్) సైతం మంజూరు చేశారనే ఆరోపణలున్నాయి. కొందరు 20ఏళ్ల క్రితం రిటైర్డ్ అయిన వారు ఉండడం, ఇప్పుడు బయటకు వెళ్లమనడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

సీపీఎం ఆధ్వర్యాన వినతి

మున్సిపల్ క్వార్టర్లను అందులో ఉంటున్న వారికే కేటాయించాలని సీపీఎం నాయకులు సోమవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజకు వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల కాలంగా ఉంటున్న వారికి ప్రత్యామ్నాయం లేనందున ఖాళీ చేయమనడం సరికాదని వివరించారు. అంతా పేదలే అయినందున ప్రభుత్వ ధర ప్రకారం క్వార్టర్లను వారికే కేటాయించాలని కోరారు. కాగా, 2007లోనే తమ పార్టీ తరఫున చేసిన ప్రతిపాదనను నాటి పాలకవర్గం ప్రభుత్వానికి పంపించిందని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ తెలిపారు. మరోమారు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి క్వార్టర్లను అక్కడ ఉన్నవారికే కేటాయించాలని కోరారు.

పంటలను ధ్వంసం చేసే సంస్కృతి సరికాదు

బోనకల్/చింతకాని: రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసే పంటలను ధ్వంసం చేసే సంస్కృతి తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్ చింతకాని రెవెన్యూలో మూడు ఎకరాల భూమిలో వరి, పెసర పంటలను సాగు చేశాడు. ఈ పంటలను ధ్వంసం చేయడంతో సోమవారం నాయకులు పరిశీలించాక నాగేశ్వరరావు మాట్లాడారు. పంటలను అదే గ్రామానికి చెందిన సంజాల నాగేశ్వరరావు ధ్వం చేయగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క – నందిని పేర్లు చెబుతూ మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు ప్రోత్సాహించాడని ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత భట్టిపై ఉందన్నారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, హరికిషన్‌రావు, గుగులోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ సంస్కృతి మాకు లేదు

బోనకల్: అరాచకాలు సృష్టించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీకి కానీ, డిప్యూటీ సీఎం భట్టికి కానీ లేదని కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు తెలిపారు. బోనకల్‌లో సోమవారం వారు మాట్లాడుతూ చొప్పకట్లపాలెంలో ఇద్దరి మధ్య జరిగిన వివాదాన్ని కాంగ్రెస్‌కు అంటకట్టే ప్రయత్నం చేయడం సీపీఎం నాయకులకు తగదన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, నాయకులు బీపీ.నాయక్, భద్రునాయక్, మరీదు శ్రీనివాసరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, ఏనుపోగు హేమూన్, ఇండ్ల నాని, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో ఖాళీలు భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరిరావు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంస్థలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీఈఈ 1104 డిస్కం కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో డిస్కం అధ్యక్షుడు బి.రఘునందన్ అధ్యక్షతన ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ సబ్ స్టేషన్లలో ఆపరేటర్ పోస్టులను భర్తీ చేసి కార్మికులపై పనిభారం తగ్గించడమే కాక ఈపీఎఫ్, జీపీఎఫ్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిస్కం అదనపు కార్యదర్శి రంగారావు, జిల్లా అధ్యక్షుడు ఎంవీ.రమణారెడ్డితో పాటు పి.సురేష్, కె.సీతారామయ్య, టీవీఎస్ఎస్.శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వరరావు, వి.కిరీటాచారి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి(50) మృతి చెందాడు. వెయిటింగ్ హాల్‌లో ఆయన మృతదేహాన్ని గుర్తించగా ఆర్‌కే ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మధిర ప్రభుత్వాస్పత్రికి మార్చురీకి తరలించినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 98481 14202, 99636 41484 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





SAKSHI SPELL Bee

సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

SAKSHI MATH BEE

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

మమత ఆస్పత్రిలో అరుదైన గుండె శస్త్రచికిత్స

ఆరోగ్యశ్రీ ద్వారా బాలికకు 'బటన్ సర్జరీ'



తేజశ్రీతో జయశ్రీ, వైద్యబృందం

ఖమ్మం అర్బన్: పుట్టుకతోనే గుండెలో రంధ్రంతో బాధపడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి చెందిన బాలికకు ఖమ్మం మమత ఆస్పత్రి వైద్యులు అరుదైన 'బటన్ సర్జరీ' చేశారు. చికిత్స వివరాలను మమత వైద్య, విద్యాసంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ సోమవారం వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం గోపాలపురానికి చెందిన చింతలచెర్వు తేజశ్రీ(18)కి పుట్టుకతోనే గుండెలో మూడు రంధ్రాలు ఉండగా రెండు కాలక్రమేణా పూడిపోయాయి. ఒకటి పెద్దగా మారడంతో ప్రాణాపాయ స్థితికి చేరింది. ఆమెను ఈనెల 13న మమత ఆస్పత్రికి తీసుకురాగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. సాధారణ విధానంలో ఓపెన్ హార్ట్ సర్జరీ కాకుండా తమ ఆస్పత్రి వైద్యులు అరుదైన బటన్ సర్జరీ విజయవంతం చేశారని జయశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో మమత సంస్థల డైరెక్టర్లు పువ్వాడ నరేన్, పువ్వాడ సాయి శిరిణీ, కార్డియాలజీ హెచ్‌ఓడీ ప్రవీణ్‌కుమార్, వైద్యులు విజయ్‌కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీలో చోరీ

ఖమ్మం అర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీలో చోరీ జరిగింది. కాలనీ 9వ వీధిలో నివసించే షేక్ గౌస్మియా ఇంట్లో ఆదివారం రాత్రి అంతా నిద్రిస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు చరబడి రెండు ఫోన్లు, ఒక జత చెవి జూకాలు ఎత్తుకెళ్లారు. మొత్తం రూ.65 వేల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు గౌస్మియా ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



వైజాగ్‌లో జిల్లా యువతి ఆత్మహత్య

ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని బలవన్మరణం



రమ్య (ఫైల్)



రమ్య రాసిన లేఖ

తిరుమలాయపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకున్నాక ఒంటరిగా వదిలేయడాన్ని తట్టుకోలేక తిరుమలాయపాలెం మండలంలోని ఎర్రగడ్డ గ్రామానికి చెందిన రమ్య(20) వైజాగ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె అంత్యక్రియలు సోమవారం గ్రామంలో నిర్వహించగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన కొర్లపుడి బాసు కుమార్తె రమ్య(20), ఇదే గ్రామానికి చెందిన మేడ చిన్న బొందయ్య కుమారుడు నరేష్ ప్రేమించుకున్నారు. కులాలు వేర్వేరు కావడంతో కుటుంబాల్లో గొడవలు జరిగాయి. ఆపై రమ్య చదువు మానేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా నరేష్ ఏడాది క్రితం మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. అయినా రమ్యతో ప్రేమ కొనసాగిస్తూ 15 రోజుల క్రితం ఆమెను వైజాగ్ తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఇంతలోనే తన కొడుకు కనరావడం లేదని నరేష్ తండ్రి చిన్న బొందయ్య ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న నరేష్ రమ్యను వదిలించుకోవాలని ఆమె వద్ద నగదు, నగలు, సెల్‌ఫోన్ తీసుకుని ఇంటికి వచ్చేశాడు. దీంతో మోసపోయానని గమనించిన రమ్య వైజాగ్‌లోని అద్దె ఇంట్లో ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 'నన్ను క్షమించండి.. నా చావుకు కారణం నన్ను ఇంత దూరం తీసుకొచ్చి నమ్మించి మోసం చేసి వెళ్లిపోయిన వాడి పేరు నరేష్. నా తల్లిదండ్రులకి, ఇక్కడి వాళ్లకు నా చావుకు ఎలాంటి సంబంధం లేదు. నాన్న సారీ.. నాన్న వాడిని మాత్రం అసలు వదిలిపెట్టకు. తమ్ముడు జాగ్రత్త. నా కోసం ఆలోచించకండి. లవ్‌యూ నాన్న. నేను ఎన్ని తప్పులు చేసినా నన్ను క్షమించావు. నీ లాంటి తండ్రి ఏ కూతురికి ఉండదు' అంటూ రాసిన లేఖను స్వాధీనం చేసుకున్న వైజాగ్ టూటౌన్ పోలీసులు పోస్టుమార్టం చేసి రమ్య మృతదేహాన్ని ఎర్రగడ్డకు పంపించారు. ఈమేరకు నరేష్ ఇంటి ఎదుట మృతదేహంతో ఆమె కుటుంబీకులు ఆందోళనకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆపై తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్‌తో పాటు కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి పోలీసులతో రమ్య అంత్యక్రియలు పూర్తయ్యే వరకు బందోబస్తు నిర్వహించారు. కాగా, నిందితుడు నరేష్‌ను వైజాగ్ పోలీసులకు అప్పగించారు.

అదే ఆవేదన.. అవే బారులు



జల్లేపల్లి కేంద్రం వద్ద గుమికూడిన రైతులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: యూరియా కోసం రైతన్నల ఎదురుచూపులు తప్పడం లేదు. తిరుమలాయపాలెం మండలానిక సోమవారం 43 టన్నుల యూరియా సరఫరా కాగా తిరుమలాయపాలెం, పిండిప్రోలు, జల్లెపల్లి పీఏసీఎస్‌లకు 10 టన్నుల చొప్పున, రాజారం, తిరుమలాయపాలెంలోని మరో రెండు షాప్‌లకు మిగతాది కేటాయించారు. పీఏసీఎస్‌ల్లో 220 యూరియా బస్తాలే ఉండడంతో ఉదయం నుంచి బారులు దీరిన రైతులకు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ఆధారంగా ఒక్కో బస్తానే ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన చేపట్టగా, పోలీసు సర్దిచెప్పి పంపించారు. అలాగే, నేలకొండపల్లికి సైతం తక్కువ మొత్తంలో యూరియా రావడంతో ఏఓ ఎం.రాధ కూపన్లు జారీచేయగా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా మాత్రమే పంపిణీ చేశారు. ఈక్రమాన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

గోదాంలో డీఏఓ తనిఖీ

కారేపల్లి: కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం(సొసైటీ) గోదాంను జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సోమవారం తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించాక ఆయన నానో యూరియాపై రైతుల నుంచి వస్తున్న స్పందనపై ఆరా తీశారు. యూరియా కొరత లేకున్నా భవిష్యత్‌లో దొరకదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఏడీఏ బట్టు అశోక్‌కుమార్, సీడీఏ బొల్లు హన్మంతరావు, ఎస్ఐ కోడెత్రాసు, ఏఈఓ నరేష్ పాల్గొన్నారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్ పరిధి మణుగూరు డిపోలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్ ఎస్.కే.ఎస్.సాహెబ్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇటీవలే మణుగూరు డిపోకు బదిలీపై వచ్చిన ఆయనకు అధికారులు టిమ్ డ్యూటీ వేయగా.. అనారోగ్యం కారణంగా తాను చేయలేనందున, కండక్టర్‌తో కూడిన డ్యూటీ వేయాలని కోరినట్లు తెలిసింది. ఈ విషయమై సోమవారం సాహెబ్ ఖమ్మంలో ఆర్ఎం సరిరామ్‌ను కలిసి తన సమస్యలు విన్నవిస్తూ ఆత్మహత్య చేసుకోవాలని వచ్చానని చెప్పడంతో అధికారులు నచ్చజెప్పారు. ఆపై బయటకు రాగానే ఆయన ఎలుకల నివారణకు వాడే మాత్రలు మింగడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్ఎం సరిరామ్, ఉద్యోగులు సకాలంలో చికిత్స చేయించడంతో సాహెబ్‌కు ప్రాణాపాయం తప్పినట్లయింది.

ఉద్రిక్తతల నడుమ అంత్యక్రియలు

- లక్ష్మీప్రసన్న భర్త, బంధువులపై దాడి
- ఇల్లు, కారూ ధ్వంసం
- కూతురుతో దహనసంస్కారాలు చేయించిన కుల పెద్దలు



దహనసంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె ఇతికా

అశ్వారావుపేట: రాజమండ్రిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన లక్ష్మీప్రసన్న మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం సోమవారం మధ్యాహ్నం అశ్వారావుపేటకు తీసుకొచ్చారు. అప్పటి వరకు రింగ్ సెంటర్ నుంచి మృతురాలు నివాసమున్న ఆమె ఆడపడుచు ఇంటివరకు పోగైన సుమారు 200 మంది.. అంబులెన్స్ రాగానే మృతురాలి భర్త నరేష్, ఆయన బావ దాసరి శ్రీనివాస్, రాజమండ్రికి చెందిన అంబులెన్స్ డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో పోలీసులుఅప్రమత్తమై నరేష్‌నుఅంబులెన్స్‌తో సహా స్టేషన్‌కు తరలించగా.. మరికొందరు ఇంటి వద్ద ఉన్న మృతురాలి ఆడపడుచుపై దాడిచేశారు. నరేష్‌బావ శ్రీనివాస్ పోలీస్‌వాహనంలో తలదాచుకున్నా వాహనం డోర్ పెకిలించి మరీ దాడికి పాల్పడ్డారు.

పీఎస్ పక్కనే ధర్నా, దాడి..

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రసన్నకు, అదే మండలంలోని ఖాన్‌ఖాన్ పేటకు చెందిన నరేష్‌బాబుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం వారు అశ్వారావుపేటలోని నరేష్ సోదరి ఇంట్లో ఉంటుండగా లక్ష్మీప్రసన్న రాజమండ్రిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం మృతి చెందింది. అయితే, భర్త, ఆయన కుటుంబసభ్యుల వేధింపులతో పాటు సరిగా భోజనం కూడా పెట్టకపోవడంతో తమ కూతురు చిక్కి శల్యమై మృతిచెందిందని తల్లిదండ్రులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈమేరకు మృతదేహాన్ని సోమవారం అశ్వారావుపేటకు తీసుకురాగా, లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు, బంధువులు పోలీస్ స్టేషన్ పక్క ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో సీఐ పింగళి నాగరాజు, ఎస్ఐ యయాతిరాజు, దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని.. విచారణతో పాటు పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక హత్య కేసుగా మారుస్తామే తప్ప ఫిర్యాదుతో చేయలేమని వివరించారు. దీంతో మృతురాలి తరఫు పెద్దమనుషులు ధర్నాను విరమింపజేయగా లక్ష్మీప్రసన్న మృతదేహాన్ని ఇంటికి తరలించేసరికి అక్కడ ఇంట్లో వారిపై దాడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు కుటుంబీకులంతా పోలీస్ స్టేషన్‌లో ఆశ్రయం పొందగా, ఇల్లు, కారుపై రాళ్లు రువ్వారు.

తలకొరివి పెట్టిన కుమార్తె

'అంత్యక్రియలు చేసేందుకు భర్త భయపడుతున్నాడు.. వారి బంధువులను మీరు కొడుతున్నారు.. మృతదేహాన్ని మీరే తీసుకెళ్లి అంత్యక్రియలు చేస్తారా' అని సీఐ నాగరాజు ప్రశ్నించగా 'మృతదేహాన్ని తీసుకెళ్లం.. అంత్యక్రియల్లోనూ పాల్గొనబోం' అంటూ లక్ష్మీప్రసన్న బంధువులు స్పష్టం చేశారు. చివరకు మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కురిశెట్టి నాగబాబు, స్థానికులు కొల్లి రవికిరణ్, పమిడి లక్ష్మణరావు జోక్యం చేసుకుని మృతురాలి కూతురు ఇస్మితానాయుడుతో తలకొరివి పెట్టించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

నాపై అభాండాలు వేస్తున్నారు..

'నా భార్య చనిపోవడానికి నేనే కారణమని ఆరోపిస్తున్నారు. నా భార్య మాట్లాడితే నిజాలు చెప్పేది. గతంలో అసలు లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు వచ్చేవారు కాదు. ఈరోజు వారే లేనిపోని అభాండాలు వేస్తూ తిండి పెట్టకుండా చంపారని చెబుతున్నారు. నన్ను నేను ఎలా నిరూపించుకోవాలి..' అంటూ నరేష్ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. అయితే, ఆమె బంధువులు మాత్రం లక్ష్మీప్రసన్నకు అన్నం పెట్టకుండా మాడ్చారని, చుటుపక్కల వాళ్లు పడేసిన ఎంగిలి ఆకుల్లో ఏరుకుని తినేదంటూ చుట్టుపక్కల వారు చెప్పారని అంటున్నారు. ఆస్తికోసం చంపేసి, జబ్బు అంటగట్టారని ఆరోపించారు. రెండేళ్లుగా తాము ఇంటికి వస్తే తలుపు తీయకపోగా, ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు పెట్టి తాము వస్తే కుక్కలను వదిలేవారని వాపోయారు.

మహిళ కళ్ల ముందే ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

బోనకల్: బోనకల్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన చింతల నాగరాజు(26) కొద్దిరోజుల క్రితం వివాహిత మహిళను ఇంటికి తీసుకొచ్చాడు. తాము పెళ్లి చేసుకున్నామని చెప్పి కలిసి ఉంటుండగా సోమవారం వారిద్దరు మద్యం సేవించారు. ఆతర్వాత ఆమె వెళ్లిపోతానని చెప్పడంతో నాగరాజు ఉరి వేసుకున్నాడు. ఆ సమయాన మహిళ అక్కడే ఉన్నా మత్తు కారణంగా అడ్డుకోలేకపోయినట్లు తెలిసింది. ఘటనపై నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు.